పేదల శ్రేయస్సే బీజేపీ లక్ష్యం

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

కవాడిగూడ: దేశంలోని పేదల శ్రేయస్సు బీజేపీ లక్ష్యమని అఖిల భారత ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ''సేవా పక్వాడా''కార్యక్రమంలో భాగంగా సోమవారం కవాడిగూడ డివిజన్ ముగ్గుబస్తీలో సీజన్స్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.లక్ష్మణ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలకు వైద్యసహాయం అందించేందుకు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తూ ప్రధాని మోదీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, జననీ సురక్ష యోజన వంటి పథకాలను ప్రవేశపెట్టి సురక్షితమైన, సమర్థవంతమైన నాణ్యతతో కూడి ఆరోగ్య సంరక్షణను అందజేస్తుందని ఈ పథకాల ద్వారా దేశంలో 10కోట్ల మంది ప్రజలు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు హరిచరణ్, బీజేపీ నాయకులు ఎం.రమేష్‌రాము, జి.వెంకటేష్, టి.రవీందర్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు గుప్తా, భరత్‌గౌడ్, రాజు, మీసాల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో ప్రభుత్వం చెలగాటం

బీఆర్ఎస్ యువజన నేత ముఠా జైసింహ


గాంధీ ఆస్పత్రి వద్ద ముఠా జైసింహ, కార్యకర్తలను తరలిస్తున్న పోలీసులు

ముషీరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ యువజన విభాగం నేత ముఠా జైసింహ అన్నారు. గాంధీ ఆస్పత్రిలో నెల రోజుల్లో 50 మందికి పైగా తల్లీ బిడ్డలు మృత్యువాత పడ్డారన్నారు. గులాబీ నేతలు భారీ సంఖ్యలో నిజ నిర్ధారణ కమిటీకి మద్దతుగా గాంధీ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు వారిని అడ్డుకోవడంతో తోపులాట, వాగ్వాదం జరిగింది. చివరకు పోలీసులు బలవంతంగా వారిని బొల్లారం, నారాయణగూడ, బండ్లగూడ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

◆ ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సీజనల్ వ్యాధులతో బాధపడుతుంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించడం లేదన్నారు. సరైన మందులు ఇవ్వకుండా ప్రజారోగ్యంతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జైసింహను హౌస్ అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా వారిని తప్పించుకొని బీఆర్ఎస్ నాయకులతో కలిసి గాంధీ ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌గుప్తా, రవియాదవ్, నాగేష్‌ముదిరాజ్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీధర్‌రెడ్డి, సాయిచాణక్య, సుధాకర్, నితీన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలవిద్యుత్ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి


ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని చూపిస్తున్న బాధితులు

పంజగుట్ట: అధికారంలోకి రాగానే శ్రీశైల జలవిద్యుత్ ప్రాజెక్టు నీటిముంపు నిర్వాసితులను ఆదుకుంటానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని ముంపు బాధితులు విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండన్న, నారాయణ రెడ్డి, గోవిందులు మాట్లాడుతూ శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టులో ముంపునకు గురైన వారిని ఆదుకుంటామని వారికి ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ హామీ ఇచ్చారని కాని అప్పటి నుంచి తమను ఎవ్వరూ ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు బాధితులకు ఉమ్మడి రాష్ట్రంలోనే ఆంధ్రా ప్రాంతం వారికి 2800 మందికి ఉద్యోగాలు ఇవ్వగా, తెలంగాణ వారికి 200 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారని తెలంగాణ వస్తే మాకు కూడా ఉద్యోగాలు వస్తాయని భావించామని కాని నిరాశే మిగిలిందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా 493 మంది బాధితులకు, వనపర్తి జిల్లాలో 1105, నాగర్‌కర్నూల్ జిల్లాలో 239 మంది బాధితులకు ఉద్యోగాలు రావల్సి ఉందని ఇప్పటికే లిస్టు తయారు చేసి ఈఎన్‌సీకి, సెక్రటేరియట్ ఇరిగేషన్ శాఖకు ఇచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు నాగర్‌కర్నూల్, పెబ్బేరు బహిరంగ సభల్లో ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

స్కూల్ అసిస్టెంట్ పోస్టులు | బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలి

పంజగుట్ట: స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులు వంద శాతం బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఈడీ నిరుద్యోగులు భూక్యా కుమార్, పాండు, అశోక్ చౌహాన్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ సెకండ్రీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ) పోస్టులు వందశాతం డీఈడీ వారికే కేటాయించినప్పుడు సూల్ అసిస్టెంట్ పోస్టులు మాత్రం ఎస్‌జీటీ వారికి పదోన్నతుల ద్వారా 70 శాతం, బీఈడీ నిరుద్యోగుల ద్వారా కేవలం 30 శాతం భర్తీ చెయ్యడంతో బీఈడీ నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురౌతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం ఉన్న వారికే పదోన్నతులు ఇస్తారు అసలు ఉద్యోగం లేనివారికి అన్యాయం ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు వందశాతం బీఈడీ నిరుద్యోగులతోనే భర్తీ చెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌ను బోర్డ్ ఆఫ్ ప్రైయిమరీ ఎడ్యుకేషన్, బోర్డ్ ఆఫ్ సెకండ్రీ ఎడ్యుకేషన్‌గా విభజించాలని డిమాండ్ చేశారు. అప్పుడే బీఈడీ వారికి డీఈడీ వారికి ఇద్దరికీ న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

- ప్రారంభం కాని ఆర్‌యూబీ నిర్మాణం
- మూడేళ్ల క్రితం రూ.20కోట్లు మంజూరు
- పట్టాలు దాటుతూ ప్రయాణం



దూరాభారం తగ్గేది ఎప్పుడు?

సికింద్రాబాద్: మాణికేశ్వరినగర్–సీతాఫల్‌మండి ప్రాంతాల ప్రజల రాకపోకలకు దూరాభారం తగ్గే పరిస్థితులు కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఈ రెండు ప్రాంతాలు చూడడానికి రైలు పట్టాలకు ఇరువైపులా ఉంటాయి. పక్కపక్కనే రెండు ప్రాంతాలు ఉన్నప్పటికీ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి 6కిలో మీటర్ల దూరం ఉంటుంది. రెండు ప్రాంతాల ప్రజల ఇబ్బందులను తొలగించడానికి జీహెచ్‌ఎంసీ అధికారులు వంతెన నిర్మాణం పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.20 కోట్ల నిధులు కేటాయించి మూడేళ్లు గడిచిపోయినా పనులు ప్రారంభం కాలేదు.

పట్టాలు దాటుకుని ప్రయాణం....

ఈ రెండు ప్రాంతాలను వేరుచేస్తూ సీతాఫల్‌మండి-ఆర్ట్స్ కళాశాల రైల్వేస్టేషన్లు ఉన్నాయి. రెండు స్టేషన్లను అనుసంధానం చేస్తూ రైల్వే ట్రాక్ ఆవరించి ఉంది. ఫలితంగా రెండు ప్రాంతాల మధ్య నేరుగా రవాణా మార్గం లేకుండా పోయింది. వాహనాలు కలిగిన వారు మాణికేశ్వరినగర్ నుంచి సీతాఫల్‌మండి ఫ్లై ఓవర్ మీదుగా సీతాఫల్‌మండి, ఇందిరానగర్, వారాసీగూడకు రావాల్సి ఉంది. లేదా ఓయూ డిస్టెన్స్ సెంటర్ మీదుగా వారాసీగూడ, బౌద్ధనగర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. వాహనాలు లేని వారు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రమాదకర పరిస్థితులు అధిగమించి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరుకోక తప్పడం లేదు. వచ్చిపొయ్యే రైళ్లను, రైలు పట్టాలు దాటేసి ఒక ప్రాంతం నుంచి మరో వైపుకు చేరుకుంటున్నారు.

దశాబ్దాలుగా ఇదే తీరు.....

రైలు పట్టాలు వేసిన రోజుల్లో ట్రాక్‌కు ఇరువైపులా జనవాసాలు లేవు. ఓయూ వైపు మాణికేశ్వరీనగర్ ఏర్పాటు కాలేదు. సీతాఫల్‌మండి ప్రాంతంలో జనవాసాలు ఉన్నప్పటికీ వాటి నిర్మాణాలు పట్టాల వరకు జరుగలేదు. ఈ కారణంగా అప్పట్లో రైల్వే అధికారులు చిన్నపాటి కాజ్‌వే కూడా నిర్మించలేదు. మూడు దశాబ్దాల నుంచి ఈ ప్రాంతంలో జనవాసాలు విపరీతంగా పెరిగాయి. ఆర్ట్స్ కళాశాల-సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ల మధ్యనున్న రైల్వే ట్రాక్‌కు ఇటు, అటు భారీ భవన నిర్మాణ సముదాయాలు వెలువడ్డాయి. దీంతో ఇక్కడి ప్రజలు తమ అవసరాల కోసం నేరుగా వెళ్లడం కోసం దారి అవసరం ఏర్పడింది.

రూ.20 కోట్లతో ప్రతిపాదనలు

సీతాఫల్‌మండి-మాణికేశ్వరీనగర్ ప్రజల రవాణా అవసరాల కోసం రైల్వేట్రాక్ కింది నుంచి (ఆర్‌యూబీ) వంతెన నిర్మించాలన్న ప్రతిపాదనన మూడు దశాబ్దాల నుంచి కార్యాచరణకు నోచుకోలేదు. ఎట్టకేలకు మూడేళ్ల క్రితం ఇక్కడ రోడ్ అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అప్పట్లోనే ఆర్‌యూబీ నిర్మాణం కోసం రూ.20 కోట్లను నిధులను జీహెచ్‌ఎంసీ కేటాయించింది.

భవనాల తొలగింపు సర్వే పూర్తి

ఆర్‌యూబీ నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ఒక సర్వే నిర్వహించారు. ఇందుకోసం 18 ప్రైవేటు భవనాలు తొలగించాలని నివేదికను సిద్ధం చేశారు. సీతాఫల్‌మండి వైపు 10 భవనాలు, మాణికేశ్వరీనగర్‌వైపు 8 భవనాలను తొలగించాల్సి ఉందని పేర్కొన్నారు. భవన యజమానులకు నష్టపరిహారం అందించేందుకు సన్నాహాలు చేశారు. ఆ తరువాత అధికారులు తీసుకున్న చర్యలు ఏవీ లేవు. ఆర్‌యూబీ నిర్మాణం కోసం తాము మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నామని మాణికేశ్వరీనగర్ వాసులు చెబుతున్నారు. వంతెన వస్తే రెండు ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పట్టాలుదాటుకునే ప్రమాదకర పరిస్థితులు దూరం అవుతాయని వారు అంటున్నారు.

రేపటినుంచి 'శ్రీమద్భాగవతం' ప్రవచనాలు

సనత్‌నగర్: మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ 'శ్రీమద్భాగవతం' ప్రవచనం ఉంటుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బుధ, గురువారాల్లో సాయంత్రం 6 గంటలకు ప్రవచనం ప్రారంభమవుతుందన్నారు.

అభినందన


మహేష్‌కుమార్‌గౌడ్‌తో శివకుమార్

చిక్కడపల్లి: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్ కుమార్‌గౌడ్ గాంధీనగర్‌కు చెందిన టీపీసీసీ సభ్యుడు పాత శివకుమార్(జగన్) కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ ముందు ఉంటుందన్నారు. రైతులకు రుణ మాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచారని కొనియాడారు.

చిన్ననాటి నుంచే పెద్దలను గౌరవించడం నేర్పుతున్నాం

బచ్‌పన్ ప్లే స్కూల్‌లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే


గ్రాండ్ పేరెంట్స్‌డేలో సందడి చేస్తున్న పెద్దలు..



మాట్లాడుతున్న పాఠశాల డైరెక్టర్ రూపారెడ్డి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్‌డేను ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాల డైరెక్టర్ రూపారెడ్డి మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే పిల్లలకు పెద్దలతో అనుబంధాన్ని పెంపొందించేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. చిన్నారులు గ్రాండ్ పేరెంట్స్‌తో కలసి వచ్చి సందడి చేశారు. పాఠశాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని చిన్నారులతో సంతోషంగా గడిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

ఇక్సోరా కాంట్రాక్టును రద్దు చేయాలి

పంజగుట్ట: మల, మూత్ర శాలల మాటున అక్రమార్జనకు పాల్పడుతున్న సంస్థపై చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు సామ్యూల్, సాయి గణేష్, అనీల్, జ్యోతినాథ్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ వివిధ సర్కిల్స్‌లో, పర్యాటక ప్రాంతాల్లో, ఎక్కువగా రద్దీ ఉండేచోట మరుగుదొడ్ల ఏర్పాటుకు కాంట్రాక్ట్‌కు పిలుపునిచ్చిందని తెలిపారు. దీంతో ఇక్సోరా కార్పొరేట్ సర్వీసెస్ ఈ టెండర్‌ను దక్కించుకుందని, జీహెచ్‌ఎంసీ టాయిలెట్‌లకు జోడించబడిన వాణిజ్య షాపులు ఏర్పాటుకు ఒక్కోదానికి మూడు లక్షల నలభై వేలు కేటాయించి నీరు, విద్యుత్, డ్రైనేజీ సిస్టమ్ అన్ని జీహెచ్‌ఎంసీనే ఇచ్చిందని తెలిపారు. సదరు వాణిజ్య షాపులో వ్యాపారం చేసుకునే వారు మరుగుదొడ్ల మెయింటనెన్స్ చేసుకుని వ్యాపారం చేసుకున్నందుకు ఎలాంటి అద్దె చెల్లించకుండా ఒప్పందం చేసుకుందన్నారు. ఇలా ఒక్కో డివిజన్‌లో 13 చొప్పున 150 డివిజన్లల్లో అందుబాటులోకి తెచ్చిందన్నారు. టాయిలెట్ బాక్సులు ఏర్పాటు చేసిన ఇక్సోరా సంస్థ వారు ఒక్కొ షాపునకు రూ. 10 వేల నుంచి రూ. 40 వేలు అద్దె వసూలు చేస్తున్నారని, అంతే కాకుండా రద్దీ ప్రాంతాల్లో, పర్యాటక ప్రాంతాల్లో వీటిపై యాడ్స్ వేసుకుని వాటి ద్వారా కూడా వసూళ్లు చేస్తున్నారన్నారు. అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశామని అయినా పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఈ కాంట్రాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేయొద్దు

వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టవద్దు



మాట్లాడుతున్న జేఏసీ నేతలు

- భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ వినతి
- ధర్నాలతో దద్దరిల్లిన కార్మిక శాఖ కార్యాలయం

చిక్కడపల్లి: భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టవద్దని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భారతీయ రాష్ట్ర కార్మిక సంఘం (ఎస్‌బీఎస్‌కేఎస్),తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్స్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ), స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం ఎస్‌బీఎస్‌కేఎస్), తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ), తదితర సంఘాల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్మికులు కార్మిక శాఖ కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు రాంబాబుయాదవ్, కాటంరాజు, వంగూరి రాములు, ఎస్.కుమార్, చంద్రమౌళి మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద బీమా, సహజ మరణం, శాశ్వత అంగవైకల్యం తదితర సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టేందుకు టెండర్లు పిలవడం సరికాదన్నారు. కేంద్ర చట్టం నిబంధనల ప్రకారం కార్మిక సంఘాల ప్రతినిధులతో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేయాలని, వారి ఆమోదంతోనే బోర్డు నిధులను ఖర్చు చేయాలన్నారు. ప్రజాపాలన, ఇందిమ్మ రాజ్యాన్ని తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం అన్యాయమన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వమే బోర్డును నిర్వహించాలన్నారు. అనంతరం డీసీఎల్ ప్రమోద్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, హన్మేష్, అనురాధ, కృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లష్కర్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వండి

- సీఎంకు లష్కర్ సాధన సమితి వినతి


సీఎంకు అందించిన వినతిపత్రాన్ని విలేకరులకు చూపిస్తున్న లష్కర్ సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.10 వేల కోట్ల నిధుల్లో నుంచి సికింద్రాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం రూ.3500 కోట్లు కేటాయించాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ కోరారు. ఈ మేరకు లష్కర్ సాధన సమితి ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 200 సంవత్సరాల చరిత్ర కలిగిన సికింద్రాబాద్ నగరం అన్ని రంగాల్లో వెనుకబడిందన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. రహదారులు మొదలు సికింద్రాబాద్ ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం ఈ పార్లమెంట్ పరిధిలోని ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ కు రూ. 500 కోట్లు కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లష్కర్ సాధన సమితి ప్రతినిధులు సాదం బాల్‌రాజ్ యాదవ్, శైలేందర్, మిట్టపల్లి బాబు రావు, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

27న దళిత జర్నలిస్ట్ చైతన్య సభ

సనత్‌నగర్: దళిత జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో జరిగే దళిత జర్నలిస్ట్ చైతన్య సభ కరపత్రాలను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 27న రవీంద్ర భారతిలో నిర్వహించే సభకు హాజరుకావాలని కోరుతూ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. దళిత జర్నలిస్ట్ ఫోరం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు దొమ్మాటి శివకుమార్, ప్రధాన కార్యదిర్శ మీసాల ఎల్లేష్, దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలి


అన్నదానం చేస్తున్న చేపూరి లక్ష్మణ్‌గుప్తా, సింగారపు రమేశ్‌గుప్తా

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు సింగారపు రమేశ్‌గుప్తా అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయం సమీపంలో గుడిశెట్టి శంకరయ్య సతీమణి వెంకట లక్ష్మి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నదాత నరసింహారావు, సంఘం నాయకులు పల్లెర్ల రమేశ్, కేవీపీ ప్రసాద్, వెంకట సుబయ్య, బాలచందర్, మామిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ఉద్యమ కళాకారులకు తీరని అన్యాయం


ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి

కాచిగూడ: మలిదశ తెలంగాణ ఉద్యమ కళాకారులకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. ఇప్పటి ప్రభుత్వమైన కనీసం కళాకారులను గుర్తించి ఉద్యోగాలు, పెన్షన్ సదుపాయాలు కల్పించాలన్నారు. సోమవారం రాష్ట్ర ఉద్యమ కళాకారుల సమావేశం కాచిగూడలో జరిగింది. ఉద్యమ జేఏసీకి అనుబంధంగా తెలంగాణ ఉద్యమకారుల కళా వేదికను ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఢోలక్ యాదగిరి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తుమ్మ ల ప్రఫుల్ రాంరెడ్డి, జేఏసీ నేతలు చంద్రన్న, ప్రసాద్, అన్వర్, రంగా రెడ్డి, డప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో భారీ వర్షం

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ముషీరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలలో వర్షం నీరు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలైన రాజాడిలక్స్ చౌరస్తా, పార్శిగుట్ట, బాప్టిస్ట్ చర్చి వీధి, రామాలయం, బాపూజీనగర్ ప్రాంతాలలో వర్షం నీరు పెద్ద ఎత్తున నిలిచిపోవడం వల్ల వాహనాదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి


బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను సన్మానిస్తున్న వాజీద్ హుస్సేన్

ముషీరాబాద్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో వెనుకబడిన కులాల అభ్యున్నతికి అంకిత భావంతో కృషి చేస్తున్నామని అన్నారు.

బీసీల అభ్యున్నతికి పాటుపడాలి


మాట్లాడుతున్న దుండ్ర కుమారస్వామి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసి బీసీల అభ్యున్నతి కోసం పాటుపడాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి విన్నవించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకొని బీసీలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ వెనుకబాటుతరాల అంశాలపై రాష్ట్రస్థాయిలో సమీక్ష సమావేశం వెంటనే నిర్వహించాలని సూచించారు. సోమ వారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థాయి సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేసి బీసీల స్థితిగతులపై సమీక్షిస్తే వారి ఎదుర్కొంటున్న సమస్యలు పూర్తి స్థాయిలో తెలుస్తాయని ఆయన విన్నవించా రు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ పూర్తి స్థాయిలో అమలు చేసి బీసీల పురోభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా కులగణన చేసి తీరుతామని రాహుల్‌గాంధీ కూడా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర స్థాయిలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు పై కేంద్ర ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలకు ఆయన విన్నవించారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.